# ది మినిస్టర్ తుమ్మల

## అభివృద్ధికి ఆయనొక ఒక బ్రాండ్

ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసిన నాయకుడు తుమ్మల నాగేశ్వర రావు నాలుగు దశాబ్దాలుగా మంత్రిగా, ప్రజా నాయకుడిగా, అభివృద్ధి దార్శనికుడిగా ఆయన చేసిన సేవలు రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించాయి.

- మంత్రిత్వ శాఖలో నలభై ఏళ్లు అరుదైన రికార్డ్
- నాలుగు ముఖ్యమంత్రుల కేబినెట్‌లలో మంత్రి
- ఎన్టీఆర్ ఆశీస్సులతో రాజకీయ ఆరంగేట్రం
- సత్తుపల్లి నుంచి రాష్ట్ర రాజకీయాల వరకూ ఎదుగుదల
- 1986 మే 14న తొలి మంత్రి ప్రమాణ స్వీకారం
- ప్రజా సేవనే రాజకీయ ధ్యేయంగా ముందుకు
- మూడు పార్టీల్లో మంత్రి పదవులు నిర్వహించిన నాయకుడు
- రహదారులే ప్రగతికి బాటలు అన్న తుమ్మల
- ఖమ్మం అభివృద్ధిలో తుమ్మలదే కీలక పాత్ర
- అయన చేతుల మీదుగా బైపాస్ రోడ్లు, బ్రిడ్జి నిర్మాణాలు
- ఇరిగేషన్ రంగంలో ప్రత్యేక ముద్ర
- సీతారామ ప్రాజెక్టుకు రూపకర్త
- గోదావరి జలాలతో ఖమ్మం సస్యశ్యామలం లక్ష్యం
- రైతు సంక్షేమానికి నిరంతర కృషి

**అశ్వారావు పేట,డిడి9 వార్త:**

ఐదు దశాబ్దాల ప్రజా జీవితం, నాలుగు దశాబ్దాల మంత్రిత్వ ప్రస్థానంలో తుమ్మల నాగేశ్వరరావు అభివృద్ధికి మరో పేరుగా మారారు. అందుకే ఆయనను "అభివృద్ధికి తుమ్మల ఒక బ్రాండ్" అని చెబుతారు

1986 మే 14న ఎన్ . టి . రామ రావు కేబినెట్‌లో తొలిసారిగా మంత్రి పదవిని చేపట్టిన తుమ్మల నాగేశ్వరరావు, 2026 నాటికి నలభై ఏళ్ల మంత్రిత్వ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ అరుదైన ఘనతను సాధించిన నాయకుల్లో ఆయన ఒకరు.

తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ ప్రస్థానం ప్రత్యేకత ఏమిటంటే, ఆయన నాలుగు ముఖ్యమంత్రుల ప్రభుత్వాల్లో మంత్రిగా పని చేశారు. ఎన్టీఆర్ కేబినెట్‌లో 1986 మే 14న, ఎన్ . చంద్రబాబు నాయుడు కేబినెట్‌లో 1995 అక్టోబర్ 8న, కె . చంద్రశేఖర్ రావు కేబినెట్‌లో 2014 డిసెంబర్ 16న, ప్రస్తుతం రేవంత్ రెడ్డి కేబినెట్‌లో 2023 డిసెంబర్ 7న మంత్రి పదవులు చేపట్టారు. మూడు వేర్వేరు పార్టీల్లో పనిచేసి కూడా ప్రజా నాయకుడిగా నిలవడం తుమ్మల ప్రత్యేకతగా నిలిచింది.

తెలుగుదేశం పార్టీ హయాంలో మైనర్ ఇరిగేషన్, ప్రొహిబిషన్, మేజర్ & మీడియం ఇరిగేషన్, ఎక్సైజ్, ఆర్ & బీ శాఖలను నిర్వహించిన తుమ్మల, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తర్వాత కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు.

తుమ్మల నాగేశ్వరరావు చిన్నతనంలో ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్లు లేక ప్రజలు పడిన కష్టాలను ప్రత్యక్షంగా చూశారు. అదే అనుభవం తర్వాత ఆయన పాలనలో రహదారుల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. గ్రామాలకు రోడ్లు చేరితేనే విద్య, వైద్యం, మార్కెటింగ్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయని ఆయన బలంగా నమ్మారు. ఖమ్మం జిల్లాలో అనేక జాతీయ రహదారుల అభివృద్ధిలో ఆయన పాత్ర కీలకంగా నిలిచింది.

ఇరిగేషన్ రంగంలో కూడా తుమ్మల ప్రత్యేక ముద్ర వేశారు. సీతారామ ప్రాజెక్ట్, భక్త రామదాసు ప్రాజెక్ట్, ఎన్టీఆర్ కెనాల్, వైరా లింక్ కెనాల్, మంచుకొండ ఎత్తిపోతల పథకం వంటి కీలక ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో ఎన్నో ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లారు. సీతారామ ప్రాజెక్ట్ కోసం ఆయన చూపిన పట్టుదల ప్రత్యేకంగా నిలిచింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ సహకారంతో ప్రాజెక్ట్‌కు ఊపిరి పోశారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో పనులు పూర్తిస్థాయిలో ముందుకు సాగుతున్నాయి.



ఎన్టీఆర్ హయాంలో తొలి పామాయిల్ మొక్కను నాటించి తెలంగాణలో ఆయిల్ ఫామ్ విస్తరణకు శ్రీకారం చుట్టిన తుమ్మల, ప్రస్తుతం వ్యవసాయ శాఖ మంత్రిగా తెలంగాణను దేశంలోనే ఆయిల్ పామ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నారు.

ఖమ్మం నగర అభివృద్ధిలో కూడా తుమ్మల పాత్ర అత్యంత కీలకంగా నిలిచింది. ఖమ్మం బైపాస్ రోడ్డు, మున్నేరు కేబుల్ బ్రిడ్జి, హై లెవల్ బ్రిడ్జిలు, భక్త రామదాసు ఆడిటోరియం, సర్దార్ పటేల్ స్టేడియం, ఖిల్లా రోప్‌వే, లకారం ట్యాంక్‌బండ్, అర్బన్ పార్క్, మోడల్ మిర్చి మార్కెట్, ఖమ్మం రింగ్ రోడ్ వంటి అభివృద్ధి పనులు ఆయన దార్శనికతకు నిదర్శనాలుగా నిలిచాయి. విద్య, వైద్యం, వ్యవసాయం, రహదారులు, టూరిజం రంగాల్లో ఆయన చేసిన సేవలు ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో చిరస్థాయిగా నిలిచాయి.

పదవులు శాశ్వతం కావని, చేసిన పనులే చరిత్రలో నిలుస్తాయని తన రాజకీయ జీవితంతో నిరూపించారు తుమ్మల నాగేశ్వరరావు. అవినీతి రహిత పరిపాలన, వేధింపుల రాజకీయాలకు దూరంగా ఉండటం, గాంధేయ మార్గంలో ప్రజాసేవ చేయడం ఆయన ప్రత్యేకతగా నిలిచాయి.

తెలుగుదేశం పార్టీలో ఎన్టీఆర్, చంద్రబాబు కేబినెట్‌లలో మంత్రి, టీఆర్ఎస్ పార్టీలో కేసీఆర్ కేబినెట్‌లో మంత్రి, కాంగ్రెస్ పార్టీలో రేవంత్ రెడ్డి కేబినెట్‌లో మంత్రి గా పని చేసిన తుమ్మల నాగేశ్వరరావు, మూడు పార్టీల్లో నలుగురు ముఖ్యమంత్రుల ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన అరుదైన నాయకుడిగా చరిత్రలో నిలిచారు.











